# శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ

శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ రెండవ శాసనసభ (1955-1962) డిప్యూటీ స్పీకర్‌గా 1957, ఏప్రిల్ 16న ఏకగ్రీవంగా ఎన్నికై 1960, జనవరి 11వరకు ఆ పదవిని నిర్వహించారు.

వీరు 1915, సెప్టెంబరు 27న ఆదిలాబాద్ జిల్లా వాంకిడి గ్రామంలో జన్మించారు. హైదరాబాదులో మెట్రిక్యులేషన్ పూర్తి అయిన తరువాత ఆర్థిక ఇబ్బందుల కారణంగా వీరు చదువును కొనసాగించలేకపోయారు. అయితే రాత్రి కళాశాలలో చేరి లా కోర్సు పూర్తి చేసి ప్రముఖ న్యాయవాదిగా పేరు పొందారు.

శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ 1938 లో జరిగిన పౌరహక్కుల ఉద్యమం మొదటి బృందం సత్యాగ్రహంలో పాల్గొని పుత్లీబౌలి వద్ద అరెస్టయ్యారు. వందేమాతరం ఉద్యమంలోను చురుకైన పాత్ర పోషించారు.

శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ న్యాయవాదిగా వృత్తిని ప్రారంభించి, రాజకీయ ఖైదీలు, విప్లవకారుల తరపున కేసులు చేపట్టి ఎందరికో స్వేచ్ఛను ప్రసాదించి ప్రజాదరణ పొందారు. 1942వ సంవత్సరములో క్విట్ ఇండియా ఉద్యమాన్ని హైదరాబాద్‌లో నడిపారు. రజాకార్ల రక్కసి మూకల నుంచి జాతీయ వాదులకు రక్షణ కల్పించడానికి, పాలకులకు వ్యతిరేకంగా పోరాడటానికి జంటనగరాలలోని వివిధ వాడలలో పౌర రక్షణ సంఘాలను స్థాపించి అధ్యక్షుని హోదాలో వాటిని సమన్వయపరిచారు.

వీరు మొదటిసారిగా 1952వ సంవత్సరంలో ఆదిలాబాద్ జిల్లాలోని ఆసిఫాబాద్ నియోజకవర్గం నుండి శాసనసభ్యుడిగా ఎన్నికైనారు. 1957 వ సంవత్సరంలో చినకొండూర్ నియోజకవర్గం నుండి ఎన్నికైనారు. వీరు శ్రీ దామోదరం సంజీవయ్య మంత్రి వర్గంలో 1960, జనవరి 11 నుండి 1962, మార్చి 11 వరకు చిన్న తరహా, కుటీర పరిశ్రమలు, అబ్కారీ శాఖ మంత్రిగా పనిచేశారు.

వీరు 1967, 1972 సంవత్సరాలలో నల్గొండ జిల్లా భువనగిరి నియోజకవర్గం నుండి శాసనసభకు ఎన్నికైనారు. వీరు డిప్యూటీ స్పీకర్ హోదాలో 1957-1958, 1959-1960 సంవత్సరములలో అర్జీల, విశేషాధికారాల కమిటీల అధ్యక్షులుగా ఉన్నారు.

శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి మంత్రివర్గంలో **1967**, మార్చి **6** నుండి **1969**, జూలై **18** వరకు కార్మిక, సమాచార, ప్రజాసంబంధాలు, పర్యాటక శాఖ మంత్రిగా వీరు పని చేశారు.

రాజకీయాలతో పాటే సాంఘిక ఉద్యమాలను ఏక కాలంలో నడిపిన సవ్యసాచి, అలుపెరుగని యోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ గారు.